మాదకద్రవ్యాల వాడకంతో అనర్థం

కడప ఎడ్యుకేషన్: మాదకద్రవ్యాల వాడకంతో తీవ్రమైన సామాజిక, మానసిక , శారీరక సమస్యలకు దారితీస్తుందని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు గుట్కా, సిగరెట్, తంబాకు, గంజాయి వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. వీటి వాడకం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. వీటన్నింటికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్లు కెప్టెన్ డాక్టర్ నీలయ్య, డాక్టర్ సావిత్రి మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక అని, విలువైన జీవితాన్ని మాదక ద్రవ్యాలతో నాశనం చేసుకోవద్దని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మహేష్, ఎన్.ఎస్.ఎస్ అధికారులు నాగరాజు, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కాడెట్స్



విద్యార్థులు, వాలంటీర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

మంచి సమాజ నిర్మాణంలో యువత ప్రాత ఎంతో కీలకం అని యోగివేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 'నషా ముక్త్ భారత్ అభియాన్ 'ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా, యోగి వేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో బుధవారం డ్రగ్స్ అలవాట్లకు వ్యతిరేకంగా సామూహిక ప్రమాణం తీసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ వల్ల జరిగే నష్టం గురించి అవగాహన కల్పిస్తూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి సమాజ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో ముఖ్యమైనదన్నారు. మనందరం కలిసికట్టుగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆశా వర్కర్ల పోరాట ఫలితమే ఉత్తర్వులు జారీ

కడప వైఎస్ఆర్ సర్కిల్: గ్రాట్యుటీ, వయోపరిమితి పెంపు, 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవుల ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ఆశా వర్కర్ల పోరాటాల ఫలితమేనని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి. సుభాషిణి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 45 వేల మంది పైగా ఉన్న ఆశా వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని అనేక పోరాటాలు నిర్వహించిన ఫలితంగా కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ 1.50 లక్షల గ్రాట్యుటీ, ఆరు నెలలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్, యూనియన్ జిల్లా అధ్యక్షులు యు.మరియమ్మ, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి బి. శాంతమ్మ, జిల్లా కోశాధికారి సి. అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

15న కల్వారి టెంపుల్ మెగా యూత్ ఫెస్ట్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కల్వారి టెంపుల్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన ఎర్రముక్కపల్లె భాకరాపేట రైల్వేగేటు వద్దగల విశ్వనాథ పురంలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాలులో మెగా యూత్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా దైవ జనులు, అంతర్జాతీయ ప్రసంగీకులు బ్రదర్ సతీష్ కుమార్, దైవ సేవకులు ఎస్ఐ బెంజమిన్, అరుణ్ శామ్యూల్ ముఖ్య అతిథులుగా పాల్గొని వాక్య పరిచర్య చేస్తారన్నారు. ఇతర వివరాలకు 80081 00299 నెంబరులో సంప్రదించాలని వారు సూచించారు.

రేపు ఘన నివాళి

కడప అర్బన్: కడప నగరంలో ఈనెల 15వ తేదీన ఉదయం 7:30 గంటలకు ఎర్రముక్కపల్లిలోని అమర్ జవాన్ సర్కిల్‌లో వీరమరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించనున్నామని జెడ్ఎస్‌డబ్ల్యూఓ భక్త వత్సల రెడ్డి, జిల్లా ప్రెసిడెంట్ బి. రమణయ్య ,వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బి.వి.గోపాల్ రెడ్డి బుధవారం ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఉండే మాజీ సైనికులు, వీరనారిమణులు, సెలవులపై వచ్చిన సైనికులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

అట్ హోం కార్యక్రమానికి జిల్లా విద్యార్థికి ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప ఐటీఐ వద్ద ఉన్న భాష్యం స్కూల్‌కు చెందిన వెంకట భవితేజన్ రెడ్డి నేషనల్ ఆస్ట్రానమి, సైన్సు ఒలంపియాడ్(ఎన్ఏఎస్ఓ)లో అఖిల భారతస్థాయిలో 51వ ర్యాంకు సాధించి జాతీయస్థాయిలో ప్రతిభచాటాడు. ఈ విజయాన్ని పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ నివాసం రాజ్‌భవన్‌లో ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవం రోజు జరిగే అట్ హోం కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా విద్యార్థికి ప్రత్యేక ఆహ్వానం అందినట్లు భాష్యం విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జ ఉమాదేవి తెలిపారు.

22న మండల సమావేశం

సిద్దవటం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫణిరాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధిపై చర్చ ఉంటుందని, అన్ని శాఖల అధికారులు నివేదికలతో తప్పక హాజరుకావాలని చెప్పారు. అలానే జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు సమావేశానికి రావాలని ఎంపీడీఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

బద్వేలు అర్బన్ : ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రమేష్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా ఆసుపత్రుల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల ప్రమాణాలు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం ఆసుపత్రుల్లో పనిచేసే వివిధ విభాగాల వైద్యుల పేర్లు రిజిస్ట్రేషన్ నెంబర్లతో సహా ప్రదర్శించాలని తెలిపారు. అలాగే స్కానింగ్ మిషన్ ఉంటే దాని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో పాటు గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని తెలిపే బోర్డులను ప్రదర్శించాలని తెలిపారు. తనిఖీల్లో నిబంధనలు పాటించనట్లు గుర్తిస్తే సంబంధిత ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు భద్రతతో కూడిన మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మహబూబ్‌బాషా, హెల్త్ అసిస్టెంట్లు జనార్ధన్‌రావు, శ్రీరాములయ్య తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణ అప్రజాస్వామికం

కమలాపురం : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలు అప్రజాస్వామికం అని, సభ్య సమాజం తలదించుకునేలా నిర్వహించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, పోలీస్ సిబ్బందిపై ఈసీ దృష్టి సారించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దొంగ ఓట్లను కట్టడి చేయాల్సిన పోలీసులే రిగ్గింగ్‌ను ప్రోత్సహించారని మండి పడ్డారు. పోలీసులు ఓటర్ల స్లిప్పులు లాక్కొని కూటమి గుండాలకు ఇవ్వడం దారుణం అన్నారు. తమ ఓట్లు తాము వేసుకుంటామని ప్రజలు పోలీసుల కాళ్లు పట్టుకుని ప్రాధేయపడాల్సిన పరిస్థితి దాపురించిందని, ఇలాంటి ఎన్నికలు గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలో పింఛన్లు తప్ప ఏ పథకం అమలు చేయలేదన్నారు. రెండో ఏడాది తల్లికి వందనం రూ.15 వేలు చెప్పి రూ.13 వేలతోనే సరిపెట్టిందన్నారు. దాదాపు 20 లక్షల మంది తల్లులకు ఎగనామం పెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు అన్నారని, ఇపుడేమో 5 రకాల బస్సుల్లోనే ఉచితం అంటున్నారని, ఇలా ఏ పథకం పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. దీంతో ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే దమ్ము ధైర్యం లేక దొంగ ఓట్లు వేసుకోవడానికి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేసి, ఓటర్లపైనే కూటమి నాయకులు దాడులకు దిగడం దారుణం అన్నారు. అయితే భవిష్యత్తులో ఇంతకు ఇంత, పదింతలు అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. రెండు స్థానాల్లో 30 పోలింగ్ బూత్‌లు, 35 వేల ఓటర్లు ఉండగా 15 వేల మంది పోలీసులను నియమించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఒంటిమిట్ట కడప డివిజన్ పరిధిలోకి వస్తుందని, అయితే ఆ కేంద్రంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ వచ్చి తన సిబ్బందిని తెచ్చి రిగ్గింగ్‌కు కీలక పాత్ర పోషించారన్నారు. పోలింగ్ సిబ్బంది కూడా కూటమి ప్రభుత్వానికి సహకరించారని, వారిపై కూడా ఈసీ చర్యలు తీసుకోవాలన్నారు. పులివెందులలో ఓటింగ్ జరుగుతుంటే అక్కడ కమలాపురం, జమ్మలమడుగు ప్రజలకు పనేముందని ఆయన ప్రశ్నించారు.

సింగపూర్ టౌన్‌షిప్‌లో ఎక్కడి చెత్త అక్కడే

కడప కార్పొరేషన్: కడప నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న సింగపూర్ టౌన్‌షిప్‌లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. సుమారు 20 రోజులుగా నగరపాలక సిబ్బంది ఇక్కడి నుంచి చెత్త ఎత్తడం లేదని తెలుస్తోంది. ఇదేమని ప్రశ్నిస్తే మీది గేటెట్ కమ్యునిటీ కాబట్టి మాకు సంబంధం లేదు...చెత్త నిర్వహణ బాధ్యత మీదేనని చెప్పినట్లు తెలుస్తోంది. దీనిపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో జంతువులు రాకుండా చుట్టూ ప్రహరీ నిర్మించారే తప్పా తమది గేటెట్ కమ్యూనిటీ కాదని, పదేళ్లుగా చెత్త సేకరణ జరిగేదని, ఇప్పుడు ఆపడానికి గల కారణాలేంటని ప్రశ్నిస్తున్నారు. సింగపూర్ టౌన్‌షిప్‌కు దగ్గర ఉన్న ఇందిరా నగర్‌లో కూడా చెత్త సేకరణ చేస్తున్నారని, ఇక్కడ మాత్రమే చేయకపోవడం దారుణమన్నారు. 20 రోజులుగా చెత్త ఎత్తకపోవడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పడి ఉందని, కాలనీ అపరిశుభ్రంగా తయారైందని వేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త సేకరణ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



సింగపూర్ టౌన్‌షిప్‌లో ఇళ్ల మధ్య చెత్తాచెదారం

వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించండి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర ప్రభుత్వం చేసుకుంటున్న విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం జరుగుతున్నదని దీనిని వ్యతిరేకించాలని వామపక్ష రైతు కౌలు రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు బి దస్తగిరి రెడ్డి, టక్కోలి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రైతు సంఘాలు, కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు నగరంలోని పాలెంపల్లి సచివాలయం దగ్గర ఒప్పంద పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రంప్, మోడీ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఒప్పందాల వల్ల కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూరుతాయన్నారు. యంత్రాలు అమ్ముకోవటానికి, వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ చేసుకోవటానికి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడతాయని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల వలన వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టేలా బహుళ జాతి సంస్థలకు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు లొంగి వ్యవహరించడం తగదన్నారు. రైతులు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు రుణాలు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కొండయ్య, వీర సుబ్బారెడ్డి, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

అలరించిన విద్యుత్ ఉద్యోగుల సాంస్కృతిక కార్యక్రమాలు

కడప కార్పొరేషన్: ఏపీ ట్రాన్స్‌కో నిలయంలో విద్యుత్ ఉద్యోగులు బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాటల పోటీల్లో డీఈ తిరుపతయ్య ప్రథమ, కంప్యూటర్ ఆపరేటర్ సతీష్ ద్వితీయ, డీఈ యు, రాజులయ్యలు తృతీయ బహుమతులు సాధించారు. నృత్యపోటీల్లో డీఈ జీకే వీరభద్రయ్య ప్రథమ, ఏఈ మదన్‌మోహన్ ద్వితీయ, డీఈ రాజులయ్య తృతీయ స్థానాల్లో నిలిచారు. ఏకపాత్రాభినయంలో ఏఈ మదన్‌మోహన్ ప్రథమ, డీఈ వీరభద్రయ్య ద్వితీయ, జిలానీబాషా తృతీయ బహుమతులు పొందారు. పౌరాణిక పద్యాలలో డీఈ వీరభద్రయ్య ప్రథమ,డీఈ రాజులయ్య ద్వితీయ, అటెండర్ కొండయ్య తృతీయ బహుమతులు సాధించారు. మహిళల షాట్‌పుట్‌లో ఏఈ పి. సుబ్బలక్ష్మి ప్రథమ, కంప్యూటర్ ఆపరేటర్ హైమవతి ద్వితీయ, కాంట్రాక్ట్ ఉద్యోగిని రాజేశ్వరి తృతీయ బహుమతి సాధించారు. మ్యూజికల్ ఛైర్స్‌లో కాంట్రాక్టు ఉద్యోగి చందన ప్రథమ, హైమవతి ద్వితీయ, రాజేశ్వరి తృతీయ స్థానాల్లో నిలిచారు.

ఈ కార్యక్రమాలను చీఫ్ ఇంజినీర్ డీవీ క్రిష్ణకుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ మస్తాన్, వీరాంజనేయులు, శరణ, కో ఆర్డినేటర్ జి. వెంకట సుబ్బయ్య, పర్యవేక్షించారు.



పోటీల్లో గెలుపొందిన ఏపీ ట్రాన్స్ కో ఉద్యోగులు

ఘనంగా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా జన్మదిన వేడుకలు

కడప కార్పొరేషన్: మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు ఎస్‌బి అంజద్‌బాషా జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు సునీత ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో దేవిరెడ్డి ఆదిత్య ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. నగర రైతు విభాగం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంజద్‌బాషా ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని, ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, మూలే సరస్వతి, బి, మరియలు, సుశీలమ్మ, తులశమ్మ, పార్టీ నాయకులు పులి సునీల్, దాసరి శివప్రసాద్, పాకా సురేష్ పాల్గొన్నారు.



జిల్లా పార్టీ కార్యాలయంలో అంజద్‌బాషాతో కేక్ కట్ చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ యామిని సూచనల మేరకు కడప శివార్లలోని కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నల్సా పథకాలపై 'న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపు' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నల్సా (అక్రమ రవాణా, వాణిజ్య లైంగిక దోపిడీ బాధితులు) పథకం 2015, నల్సా (పిల్లల కోసం పిల్లల-స్నేహపూర్వక చట్టపరమైన సేవలు) పథకం 2024, అలాగే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, మధ్యవర్తిత్వం, ఉచిత న్యాయ సహాయం , ప్రాథమిక హక్కులు, విధులు, విద్యాహక్కు, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, 357 ఏసిఆర్‌పిసి, బాల్య న్యాయ చట్టం, పోక్సో చట్టం, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం, శిశు సంక్షేమ కమిటీ విధులు, శిశుగృహ విధులు, భారత రాజ్యాంగం, ఆర్టికల్ 21, 1098 హెల్ప్ లైన్, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181, న్యాయ సహాయం కోసం హెల్ప్‌లైన్ - 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 మొదలు అంశాలను తెలియజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

స్టాల్స్ ఏర్పాటు: జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, డిస్టిక్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, వన్ స్టాప్ సెంటర్, వైద్య ఆరోగ్యశాఖ, కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ వారు స్టాల్స్ లను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌ల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుల గ్రూప్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్ యాదవ్, అడిషనల్ డిస్టిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రవిబాబు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కడప ఎడ్యుకేషన్: కడప కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఇండియన్ రెడ్ క్రాస్ వాలంటీర్లతోపాటు ఎన్‌సీసీ విద్యార్థినులు సంయుక్తంగా బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి సలీంబాష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన దేశ స్వాతంత్ర ఉద్యమ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అంతేకాక స్వాతంత్రోద్యమ చరిత్రలో పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకం గొప్పదనాన్ని తెలియచేశారు. అంతేకాక విద్యార్థినులంతా సమైక్యత దేశభక్తి భావనతో మెలగడం ద్వారా దేశ సమగ్రతను కాపాడాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. శచీ దేవి, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్. బి. స్వరూప పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సలీంబాష

సాంస్కృతిక కార్యక్రమాలతో వికాసం



పోటీలో విజేతలుగా నిలిచి సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల సమగ్ర వికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఎస్‌కే యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో కళోత్సవ్, ఏక భారత్ శ్రేష్ట భారత్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు కడప క్లస్టర్‌లోని పలు కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఎస్‌కే యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఓబుల్‌రెడ్డి హాజరుకాగా న్యాయ నిర్ణేతలుగా యోగివేమన విశ్వ విద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్‌లను అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మునేష్‌మీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

సెమి కండక్టర్ ప్రాజెక్ట్‌ను కొప్పర్తిలో నిర్మించాలి

కడప ఎడ్యుకేషన్: సెమి కండక్టర్ ప్రాజెక్ట్‌ను కడప కొప్పర్తి పారిశ్రామిక వాడలో నిర్మించాలని పిఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరంలోని పిఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఇండియా సెమి కండక్టర్ మిషన్‌లో భాగంగా రూ. 4,015 కోట్లతో 4 యూనిట్లను ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, పంజాబ్ రాష్ట్రాలలో ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అయితే ఈ సెమి కండక్టర్ ప్రాజెక్ట్‌ను కడప కొప్పర్తి పారిశ్రామిక వాడలో ఏర్పాటు చెయ్యాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును తిరుపతిలో ఏర్పాటు చేయాలని ఆలోచనలో ఉందని తెలిసిందన్నారు. అయితే ఇప్పటికే తిరుపతి పారిశ్రామిక వాడలో అనేక పరిశ్రమలు రావడం వల్ల ఎలక్ట్రానిక్ క్లస్టర్ గా మారి అక్కడ నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కడప కొప్పర్తి పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసి, ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, జిల్లా నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం

జమ్మలమడుగు : ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని డీపీఎం ప్రవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ముద్దనూరు రహదారిలో ఉన్న వరప్రసాద్ అనే రైతు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్స్‌తోపాటు తేనే టీగల పెంపకాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. శనగపంట సాగుచేసే రైతులతో సీఎండీసీ వేయించాలన్నారు. రైతులు రసాయన ఎరువులకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయం వైపు రావాలన్నారు. శనగ పంట రైతులకు 30 రకాల విత్తనాలతో పీఎండీసీ చేయించాలని సిబ్బందికి సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెరిగి దిగుబడి పెరగడంతోపాటు నాణ్యమైన పంట వస్తుందన్నారు. అనంతరం డీసీఎం ద్వారా సాగుచేసే పంటల ఆదాయం గురించి రైతును అడిగి తెలుసుకున్నారు.